క్లుప్తంగా

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించాలి. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా 'నరవ'



నియామక పత్రం స్వీకరిస్తున్న ప్రకాశరావు

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ సదరన్ రీజియన్ వార్షిక సమావేశం సారథి స్టూడియోలో జరిగింది. ఈ సమావేశాలకు ఆంధ్ర, తెలంగాణతో పాటు, కర్ణాటక, పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు హాజరయ్యారు. పరిశ్రమతో పాటు ప్రేక్షకుల్లో వచ్చిన మార్పులపై చర్చించినట్టు నరవ తెలిపారు. అనంతరం మూడేళ్ల కాల పరిమితికి ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తాను కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యాయని నరవ తెలిపారు.

30న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు



బాడీబిల్డర్‌కు ట్రాక్‌సూట్ అందిస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: మండలంలోని న్యూ పెంటమాంబ జిమ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు హాజరు కానున్న బాడీ బిల్డర్లకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గురువారం ట్రాక్ సూట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. విజేతలకు మిస్టర్ విశాఖ టైటిల్‌తో పాటు ఇరవై వేల రూపాయలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. రామిరెడ్డి, కిలాన ముసలయ్య, నాగిరెడ్డి, ప్రసాద్, రామోజీ పాల్గొన్నారు.

ఆంధ్ర టెక్ లీగ్ పోస్టర్ విడుదల

ఏయూ క్యాంపస్: సాంకేతిక రంగంలో యువతను ప్రోత్సహించేలా ఆంధ్ర టెక్ లీగ్ నిర్వహిస్తున్నట్టు టెక్ టీం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి..ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫైనల్ పోటీలు ఏయూ ఆ హబ్ వేదికగా అక్టోబర్ 1న నిర్వహించనున్నారు. డిజైన్ థింకింగ్, త్రీడీ ప్రింటింగ్, కోడింగ్, రోబోటిక్స్, డ్రోన్స్, హ్యూమనాయిడ్ రోబోట్ అంశాల్లో ఈ పోటీ లు జరుగుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చునన్నారు.

'ఎన్ఈపీ-2020'తో సత్ఫలితాలు

- 21వ శతాబ్ద అవసరాలకు అనుగుణంగా బోధన
- ఆటపాటలతో విద్యార్థుల అభ్యసనం
- ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ



విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ, పలు కేవీల ప్రిన్సిపాల్స్



ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో బోధనకు వినియోగిస్తున్న చిత్రాలు,బొమ్మలను పరిశీలిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: జాతీయ విద్యావిధానం – 2020లో భాగంగా విద్యార్థులు ఆటపాటల ద్వారా అభ్యసిస్తున్నారని ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ అన్నారు. 21వ శతాబ్ద అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా ఈ విధానం ఉందన్నారు. ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో నూతన విద్యావిధానం అమలై మూడేళ్లు అయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలు మూడు విధాలుగా విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వారు విద్యపై ఆసక్తి పెంచుకునేలా, సులువుగా అర్థం చేసుకునేలా ఆటపాటలతో ఉపాధ్యాయులు బోధిస్తున్నారన్నారు. పాఠశాలకు విద్యార్థులు సంతోషంగా వస్తున్నారని చెప్పారు. వారిలో శాస్త్రీయ స్వభావాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

49 కేవీల్లో బాల్వాడీ విధానం

49 కేంద్రీయ విద్యాలయాల్లో బాల్వాడీ విధానం అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. 3ప్లస్, 4ప్లస్, 5ప్లస్ ఏళ్ల వయసు గల విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి, బోధిస్తున్నామన్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో 5,477 మంది విద్యార్థులు మూడు తరగతుల్లో ప్రవేశం పొందారని తెలిపారు. విద్యాలయాల్లో పేరెంట్ టీచర్ అసోసియేషన్ ఉందని, ప్రతీ నెలా పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మెరుగైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

వన్ నేషన్.. వన్ డిజిటల్ ప్లాట్‌ఫాం

నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫౌండేషన్ స్టేజ్ (ఎన్‌సీఎఫ్ ఎఫ్ఎస్) 2022లో పాఠ్యాంశాల్లో 8వ తరగతి నుంచి అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను వృత్తిపరమైన సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టారన్నారు. 228 కేవీల్లో స్కిల్ హబ్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పీఎం ఈ-విద్య ద్వారా విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్, ఆన్ ఎయిర్ ద్వారా విద్యను అందిస్తున్నారన్నారు. వన్ నేషన్.. వన్ డిజిటల్ ప్లాంట్‌ఫాంగా ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన అభ్యసనం కోసం కేవీల్లో డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌లతో స్మార్ట్ క్లాస్‌రూములు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులకు ఏ విధంగా విద్యాబోధన చేస్తున్నారో వివరించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యాభ్యాసం కోసం తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు, వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. వాటిని పలు కేంద్రీయ విద్యాలయాల ప్రిన్సిపాల్స్ సందర్శించారు. కార్యక్రమంలో కేవీ-2 ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కేవీ-1 ప్రిన్సిపాల్ సురేష్ కుమర్, స్టీల్‌ప్లాంట్ కేవీ ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, మల్కాపురం కేవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



బోధనకు వాడుతున్న బొమ్మలు

నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో మిల్లెట్స్ వారోత్సవాలు



మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని వివరిస్తున్న విద్యార్థులు



కార్యక్రమంలో భాగంగా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బ్రిగేడియర్ రామనాథన్ తదితరులు

సింధియా: నేవీ చిల్డ్రన్స్ స్కూల్‌లో మిల్లెట్స్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 19 ప్రారంభమైన ఉత్సవాలు 26వ తేదీ వరకు జరిగాయి. వారోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలను ప్రదర్శించడంతో పాటు ఆరోగ్యకర జీవనశైలిలో వాటి ప్రాధాన్యాన్ని విద్యార్థులు వివరించారు. స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్, క్విజ్, ఇంటర్‌స్కూల్ పేపర్ ప్రెజెంటేషన్, ప్యానెల్ డిస్కషన్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు రుచికరమైన వంటకాలను పరిచయం చేసేందుకు మినుములతో రుచికరమైన వంటల పోటీని కూడా నిర్వహించారు. కార్యక్రమానికి బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, వీఎస్ఎం, డీడీజీ అండ్ సీఈ, డీజీఎన్‌పీ ముఖ్య అతిథులుగా హాజరై వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేశారు. అనంతరం జొన్నల వంటకాల సంకలన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడి జీవీఎంసీ పాఠశాల వెనుక గల మార్గంలో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నామన్నారు. వార్డు పరిధిలోని వెంకన్నపాలెం కృష్ణాలయం వద్ద రూ.15 లక్షలతో సీసీ రోడ్డు వేయిస్తున్నట్టు వివరించారు. ఇదే వార్డులో పల్లివీధిలో 3.5 లక్షలతో సామాజిక భవనం మరమ్మతులు చేపడుతున్నామని, స్థానిక ప్రియదర్శిని కాలనీలో 9.30 లక్షలతో నూతన సామాజికభవనం నిర్మిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, నాయకులు నూకరెడ్డి, రవి, జీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హరిత నగరానికి స్థల పరిశీలన



జిందాల్ భవన్ వద్ద స్థలం పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: జగనన్న హరిత నగరాలను గుర్తించి మొక్కలు నాటే నిమిత్తం జీవీఎంసీ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్థల పరిశీలన చేశారు. ఇక్కడి జాతీయ రహదారి పక్కనే ఉన్న జిందాల్ భవన్ వద్ద గ్రీన్ బెల్టులో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హరిత నగరాలు కార్యక్రమం ద్వారా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జాతీయ రహదారి పక్కనే ఉన్న స్థలంలో మొక్కలు నాటుతున్నామన్నారు. వార్డులోనూ పలు చోట్ల మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ అర్చన, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల సమస్యలపై వినతి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ గంకల కవిత, బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్‌కు, జీవీఎంసీ కార్యాలయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారికి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మలకు వారు వినతిపత్రాలు అందించారు. వార్డులో పర్యటించాలని, కొండవాలులో రిటైనింగ్ వాల్స్, బీటీ రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

పేద విద్యార్థికి 'ఆడారి' ఆర్థిక సాయం



లక్ష్మణకుమార్‌కు చెక్కును అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు జెర్రిపోతుల అప్పలనాయుడు కుమారుడు లక్ష్మణకుమార్ చదువు నిమిత్తం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థిక సహకారం అందించారు. అప్పలనాయుడు గత జనవరిలో అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆయన ముందుకు వచ్చారు. ఈ మేరకు లక్ష్మణకుమార్ డిగ్రీ చదువు నిమిత్తం రూ.15వేల చెక్కును అందించగా, దానిని నాగేశ్వరరావు గురువారం విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆడారి ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వరపల మహేష్, కన్వీనర్ దండి శ్యామ్, గృహ సారథులు జె.శివ, పి.జోగారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు



గరుడసేవను నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా స్వర్ణతులసీ దళార్చన
- విశేషంగా నిత్య కల్యాణం
- వైభవంగా గరుడసేవ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. ఉభయదాతలను వెంటబెట్టుకుని స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజలో 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ పూజలను నిర్వహించారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాద్రినాథునికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా గరుడసేవ

సింహాచలేశునికి గురువారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఉద్దేశపూర్వకంగానే 'ఉక్కు' ఉత్పత్తికి ఆటంకం

- విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను అడ్డుకుంటాం
- ఉక్కు పరిరక్షణ. పోరాట కమిటీ నాయకులు
- 896వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి గంగవరం పోర్టు యాజమాన్యం కావాలనే ఆటంకం కలిగిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కావాల్సిన కుకింగ్ కోల్ తరలింపునకు అడ్డు తగులుతూ విశాఖ ఉక్కుపై విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను కార్మికులందరం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 896వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, ప్రైవేటీకరణకు సహకరిస్తున్న గంగవరం పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్ మధ్య హ్యాండ్లింగ్ చార్జీల లావాదేవీలు నిరంతరం జరుగుతుంటాయని, కానీ, ఇటీవల ఉద్దేశపూర్వకంగానే అదాని గంగవరం పోర్టు యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవరోధాలు కల్పిస్తోందని ఆరోపించారు. పోర్టు యాజమాన్యం త్వరితగతిన సమస్యను పరిష్కరించకపోతే గంగవరం పోర్టుకు అనుసంధానమైన రోడ్డు, రైళ్లు, వేగన్లు, నీరు, విద్యుత్ వంటి వాటిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వానికి తోడుగా గంగవరం పోర్టు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆసన్నమైందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: రాష్ట్రంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 61వ వార్డు జనతాకాలనీలో కార్పొరేటర్ కొణతాల సుధతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పడుతోందన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు రాష్ట్రాభివృద్ధి చేస్తూ సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రతీ ఇంటి తలుపు తట్టాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో చేసిన అప్పులను తీర్చుతూ, మరో వైపు సంక్షేమం సక్రమంగా నడుపుతూ జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు, జీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు), అనుదీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ



స్వామికి నివేదించిన పులిహోర, తీపి పదార్థాలు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. వైదిక ధర్మ ప్రకారం ఈ సంస్థలు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక, శ్రీవారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. స్వామిని పుష్పాలు, తులసి మాలలతో అలంకరించారు. పులిహోర, తీపి పదార్థాలను నివేదించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.


జారిపడిన మట్టి పెళ్లలు

గోపాలపట్నం: గోపాలపట్నం మోదకొండమ్మ ఆలయం వద్ద కొండను ఆనుకుని ఉన్న సింహాచలం దేవస్థానం ప్రహరీ గోడ వద్ద కొండ నుంచి మట్టి పెళ్లలు జారి పడ్డాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నానిపోయిన మట్టి ఇక్కడి అమ్మవారి మండపం వద్ద జారి పడింది. ఇది గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఇది అంత ప్రమాదకరం కాదని స్థానికులు చెబుతున్నా.. వర్షాలు ఎక్కువగా పడితే ఇబ్బందిగా మారుతుందేమో అని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారంతో ఎమ్మెల్యే గణబాబు ఇక్కడి పరిస్థితిని పరిశీలించారు.

రామసేతు పునర్నిర్మాణానికి సైకిల్ యాత్ర

సింహాచలం : రామసేతును పునర్నిర్మించాలని కోరుతూ గుజరాత్‌కి చెందిన చోహాన్ అనే భక్తుడు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం సింహాచలానికి చేరుకుంది. దేశంలోని పలు పుణ్యక్షేత్రాలకు సైకిల్‌పై తిరుగుతూ సింహాచలం తొలి పావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నాడు. విశ్వహిందూ పరిషత్ నాయకుడు పూడిపెద్ది శర్మ తదితరులు అతనికి స్వాగతం పలికారు. చోహాన్ మాట్లాడుతూ సైక్లోన్ ఎఫెక్ట్‌తో కూలిపోయిన రామసేతుని తిరిగి నిర్మించేందు ప్రభుత్వంలో చలనం వచ్చేలా ప్రజల్లో చైతన్యానికి ఈ భారతదేశ యాత్రని చేపట్టానన్నారు. 124 రోజుల క్రితం గుజరాత్ నుంచి యాత్రని ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికి ఐదు వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణించినట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్



విద్యార్థులతో ఏయూ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సోషల్ వర్క్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో 'గ్రామీణ ప్రాంతాలలో ఏ విధమైన కార్యక్రమాలు నిర్వహించాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. యూబీఏ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ గ్రామాల్లో యూబీఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.సోని హవీల పాల్గొన్నారు.